జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 10-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 588 పేజీలు: 4 వెల : రూ.7

# చట్టానికి వ్యతిరేకంగా.. వార్తలు రాయొద్దు

* పునశ్చరణ శిక్షణను పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలి
* సీఆర్ మీడియా అకాడమీ అధ్యక్షులు ఆలపాటి సురేష్ కుమార్
* పాత్రికేయులకు సర్టిఫికెట్లు ప్రదానం



సోంపేట, ఫిబ్రవరి9(వార్త): చట్టానికి వ్యతిరేక వార్తలు రాయరాదని సీఆర్ మీడియా అకాడమీ అధ్యక్షులు ఆలపాటి సురేష్ సూచించారు. సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సోంపేటలోని వీబీఆర్ ఫంక్షన్ హాల్‌లో రెండో రోజు సోమవారం జిల్లా గ్రామీణ విలేఖరుల పునశ్చరణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఆర్ అకాడమీ తరపున నిర్వహిస్తున్న పునశ్చరణ శిక్షణ తరగతులను గ్రామీణ పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. భారత చట్టాలకు వ్యతిరేకంగా వార్తలు ప్రజెంటేషన్ చేయరాదని స్పష్టం చేశారు. మన రాత వలన మన ప్రక్కన ఉన్న వారికి ఇబ్బంది ఉండకూడదని తెలిపారు. మనం రాసే వార్త సరి చూసుకోవాలని చెప్పారు. చట్టాలు, పత్రికా స్వేచ్ఛల గూర్చి తెలుసుకోవాలన్నారు. ప్రజాశక్తి దిన పత్రిక సంపాదకులు తులసీదాస్ రూరల్ మాట్లాడుతూ ఎక్కువ మండలాల్లో విలేఖరులంతా ఒకే వార్తను సిండికేట్‌గా ఇస్తున్నారని, అలా కాకుండా స్వయంగా తెలుసుకొని వార్త ఇస్తే బాగుంటుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విలేఖరులు సోషల్ మీడియాను వినియోగించుకోవాలన్నారు. ఒక వార్త ప్రజంట్ చేసినప్పుడు ప్రతీ సంఘటనకు పూర్వ పత్రాలను అధ్యయనం చేయాల్సిన అవసరముందన్నారు. సీనియర్ పాత్రికేయులు బెందాళం కృష్ణారావు మాట్లాడుతూ సామాన్య ప్రజలు, పట్టణ ప్రాంతాల్లో నివసించే ప్రజల భాష వేర్వేరుగా ఉంటుందన్నారు. సామాన్య ప్రజలు ఆ ప్రాంతాలకు అనుగుణంగా మాట్లాడుతారన్నారు. అందరికీ ఉపయోగపడేది పత్రికా భాషని చెప్పారు. సీనియర్ జర్నలిస్ట్ డి. సోమసుందర్ మాట్లాడుతూ వృత్తిలో రోజు వారీ ఎదురయ్యే చట్టపరమైన చట్టాలు గూర్చి విలేఖరులు తెలుసుకోవాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ నల్లి ధర్మారావు కళింగ ఆంధ్ర చరిత్ర - జర్నలిజం పాత్ర పై మాట్లాడుతూ ఏకాభిప్రాయం పై ఎక్కడి నాగరికత ఎలా పరిణామం చెందాం అనే అంశాలపై వివరించారు. అనంతరం పునశ్చరణ తరగతుల్లో పాల్గొన్న జర్నలిస్టులకు సర్టిఫికెట్లు అందచేస్తారు. సమావేశంలో సిఆర్ మీడియా అకాడమీ కార్యదర్శి వి.మణిరాం, సీనియర్ పాత్రికేయులు బొడ్డేపల్లి రాజగోపాలరావు, ఏపి ట్రైనర్ కుర్రా విజయ్ కుమార్, ఎపియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు సీహెచ్ జగదీష్ కార్యదర్శి సనపల రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి రాజు, గ్రామీణ పాత్రికేయులు, పాల్గొన్నారు.

# పెళ్లి కోసం..చోరీ

* వృద్ధురాలికి నిద్ర మాత్రలు ఇచ్చి చోరీకి పాల్పడిన కేటుగాళ్లు
* ముగ్గురి అరెస్టు, రెండు లక్షల నగదు, ఆభరణాలు స్వాధీనం
* కేసు వివరాలు వెల్లడించిన కాశీబుగ్గ డీఎస్పీ



పలాస, ఫిబ్రవరి 9 (వార్త): పెళ్లి కోసం దొంగతనానికి పాల్పడిన కేటుగాళ్లను కాశీబుగ్గ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను కాశీబుగ్గ డీఎస్పీ షేక్ సహబాజ్ అహ్మద్ సోమవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్లో మీడియాకు వివరించారు. పలాస మండలం శాసనం గ్రామానికి చెందిన మంగి గణేష్.. ఓ బాలికను వివాహం చేసుకునేందుకు అవసరమైన నగదు కోసం దొంగతనానికి పాల్పడ్డాడు. దీనికి గాను ఆ బాలిక తమ్ముడి సహాయం తీసుకున్నారు. పలాసలోని బత్తులవీధికి చెందిన మల్లా ప్రేమకుమారి అనే వృద్ధురాలు అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆమెతో వారు స్నేహం పెంచుకున్నారు. ఆమె వద్ద రూ.2.50లక్షలు ఉన్నట్టు గమనించారు. ఆమెకు కూల్‌డ్రింక్స్ అంటే ఇష్టమని గుర్తించారు. శనివారం మధ్యాహ్నం ఆ వృద్ధురాలి వద్దకు వారు వెళ్లి మాటల్లో కలిపి మత్తుమందు కలిపిన కూల్ డ్రింక్ తాగించారు. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే వారు ఆ వృద్ధురాలు ఇంట్లో ఇనుపపెట్టెలో దాచుకున్న నగదు, ఆమెకు ఉన్న బంగారు చెవిదుద్దులు అపహరించారు. ఆ వృద్ధురాలు సాయంత్రం వరకూ ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి ఇరుగుపొరుగు వారు ఆ ఇంట్లోకి వెళ్లి చూడగా అచేతనంగా పడివుంది. దీంతో కాశీబుగ్గ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ వై.రామకృష్ణ వెళ్లి పరిశీలించగా.. ఆమె అస్వస్థతకు గమనించి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం ఉదయం ఆమె కోలుకుంది. తనకు కూల్‌డ్రింక్ ఇచ్చారని, ఆ తర్వాత ఏమైందో తెలియదని ఆమె వాపోయింది. తనవద్ద ఉన్న రూ.2.50 లక్షలు, పావుతులం బంగారం చెవిదుద్దులు కనపడడం లేదని తెలిపింది. పోలీసులు తమదైన శైలిలో దర్యాప్తు చేశారు. చోరీకి పాల్పడిన ఇద్దరు మైనర్లతోపాటు.. దొంగతనానికి పథకం వేసిన మంగి గణేష్‌ను సోమవారం అరెస్టు చేసినట్టు డీఎస్పీ షేక్‌సహబాజ్ అహ్మద్ తెలిపారు. చోరీ సొత్తు రికవరీ చేసి.. వారిని పలాస కోర్టులో హాజరుపరిచామన్నారు. ఒక్కరోజులో కేసు మిస్టరీని చేధించిన కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

## రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో దొంగతనం



శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి9(వార్త): శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీ రెండో లైన్‌లో నివాసముంటున్న రిటైర్డ్ నేవీ ఉద్యోగి ఏవీ రత్నం ఇంట్లో చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. రిటైర్డ్ నేవీ ఉద్యోగి ఏవీరత్నం, భార్య రాధిక జనవరి 24న బెంగళూరులో ఉన్న కుమారుడి వద్దకు వెళ్లారు. అయితే సోమవారం ఏవీరత్నం నివసిస్తున్న ఇంటి పక్కన సందులో ఉన్న కిటికీ తలుపు ఊచలు విరగ్గొట్టి ఉండడాన్ని స్థానికులు గమనించి వారికి ఫోన్‌లో సమాచారం అందించారు. దీంతో వారు తమ బంధువులకు విషయం తెలియజేసి ఇంటికి వెళ్లి చూడాలని కోరారు. వారువచ్చి చూడగా దొంగతనం జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ ఎస్ఐ లక్ష్మి, క్లూస్‌టీం సభ్యులతో కలిసి ఘటనా స్థలానికి చేరకుని వివరాలు సేకరించారు. బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారం చోరీకి గురైనట్టు బాధితులు వాపోయారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



భద్రాచలం కళ్యాణోత్సవానికి..

## గోటి తలంబ్రాలు

**-నరసన్నపేటలో సంప్రదాయం కొనసాగింపు**

**నరసన్నపేట, ఫిబ్రవరి 9(వార్త):** భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాలకు గోటి తలంబ్రాలను పంపించడం ఆనవాయితీగా కొనసాగుతుందని నరసన్నపేటలోని శ్రీ వినాయక కమిటీ మహిళా సభ్యులు తెలిపారు. ఈ సంప్రదాయంలో భాగంగా గోటి తలంబ్రాల తయారీ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. సోమవారం కమిటీ సభ్యులు మాట్లాడుతూ, భద్రాచలం నుంచి వచ్చిన ధాన్యాన్ని దేవాలయానికి తీసుకువచ్చి, సంప్రదాయ పద్ధతిలో గోటితో ఒలిచి తలంబ్రాలుగా సిద్ధం చేశామని తెలిపారు. ఈ ప్రక్రియను భక్తి భావంతో, నియమ నిష్ఠలతో నిర్వహించినట్లు వివరించారు. తలంబ్రాల తయారీ పూర్తైన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, భద్రాచలంలోని శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాలకు పంపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా భక్తుల మధ్య ఆధ్యాత్మిక అనుబంధం మరింత బలపడుతోందని వారు పేర్కొన్నారు. సంప్రదాయాలు, ఆచారాలు తరతరాలుగా కొనసాగుతూ రావడం విశేషమని, భద్రాచల కళ్యాణోత్సవాలకు గోటి తలంబ్రాల పంపకం ఒక పవిత్రమైన భాగమని కమిటీ సభ్యులు తెలిపారు.



## ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ సమస్యకి మోక్షం



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 9 (వార్త):** లొద్దపుట్టి గాంధీ వీధి లో కరెంట్ స్తంభం సమస్య రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బి అశోక్ దృష్టికి వెల్లడంతో మోక్షం లభించింది. ఎమ్మెల్యే సహకారం తో కరెంట్ స్తంభము కూటమి నేతలు వేయించారు. పెదిన దుర్యోధనరెడ్డి, హరీష్,పరశురామ రెడ్డి, తులసయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీనివాస కళ్యాణం



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 9 (వార్త):**తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీనివాసుడు భూదేవి శ్రీదేవి సమేతంగా టి.బరంపురంలో సోమవారం స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీనివాస కళ్యాణం ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీనివాసుని కళ్యాణం కనుల పండువగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమయ్య ప్రాజెక్టు మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌కు 53 వినతులు


**శ్రీకాకుళం, ఫిబ్రవరి 9(వార్త):** ప్రజా ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక కార్యక్రమంలో (పిజిఆర్ఎస్) స్వీకరించే ఫిర్యాదులు పరిష్కారానికి శ్రద్ధ వహించి ఆయా ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి, త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను అదనపు ఎస్పీ (అడ్మిన్) కెవి రమణ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన 53 మంది ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే ఫోన్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులకు తెలియ పరిచి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. అర్జీదారులు వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఆయా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా,తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అదనపు ఎస్పి కెవి రమణ అధికారులను ఆదేశించారు. ఈ 53 ఫిర్యాదులలో కుటుంబ సభ్యులు, ఆస్తి తగాదాలు, వ్యక్తిగత గొడవలు, మోసపూరితమైన వంటి అంశాలపై ప్రజా ఫిర్యాదులు అందాయి.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన ప్రమీల



**సరుబుజ్జిలి, ఫిబ్రవరి 9(వార్త):** ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలో అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలకు వైద్య ఖర్చులు నిమిత్తం, చికిత్స పొందుతూ చనిపోయిన వారి కుటుంబాలకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులను ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి ప్రమీల పంపిణీ చేశారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ప్రమీల తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భీమవరం జట్టు గెలుపు



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 9 (వార్త):** వెచ్చా జయంతి స్మారక అంతరాష్ట్ర క్రికెట్ పోటీలో భాగముగా పూరి మరియు భీమవరం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో టాస్ గెలిచి పూరి జట్టు బ్యాటింగ్ ఎంచుకోగ నిర్ణీత 20 ఓవర్లకి గాను కేవలం 17ఓవర్లు లో 116 ఓవర్లకి ఆలౌట్ అయ్యింది. భీమవరం బౌలర్ మోసెస్ 3 వికెట్లు తీసుకోగ అనంతరం భీమవరం జట్టు కేవలం 12.3 ఓవర్ల లో కేవలం 3 వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసి విజయం సాధించింది. మోసెస్ 42 పరుగులతో పాటు 3 వికెట్లు తీసుకున్నందుకు గాను మ్యాన్ అఫ్ ది మ్యాచ్ గా ఎన్నుకోబడ్డాడు. అంపైర్ లు గా మన్మధ లోకు సురేష్ వ్యవహరించారు. మ్యాచ్ కేశవరావు, కృష్ణయ్య, కాళ్ళ దిలీప్ యాదవ్, షేక్ మున్నా, టి వి రవణ సమక్షంలో జరిగింది.

## వెనుకబడిన పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 9 (వార్త):** రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం మార్చిలో జరగబోతున్న పబ్లిక్ పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థుల కొరకు 30 రోజుల రెసిడెన్షియల్ కార్యక్రమాన్ని ఈ నెల 9 నుంచి 13 వరకు బీసీ బాలుర హాస్టల్ లో నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు అప్పారావు, విశ్వనాధ్ లు తెలిపారు. వజ్రపుకొత్తూరు నుంచి 29 మంది, నందిగామ నుంచి ఇద్దరు ఇచ్ఛాపురం నుంచి ఏడుగురు మొత్తం 38 మంది విద్యార్థులు , కేజీబీవీ నుంచి ఏడుగురు ఉన్నారని, అందరు విద్యార్థులకు హాస్టల్ వద్దే ఉపాధ్యాయులు ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వబడునని చెప్పారు.



# అభివృద్ధి లక్ష్యాలు చేరుకోవాలి

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 9(వార్త):** ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలను నిర్ణీత కాలపరిమితిలో సాధించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. పరిపాలనలో పారదర్శకత, వేగం పెంచడం ద్వారానే ప్రజా సంక్షేమం నెరవేరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం అమరావతి నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లాలోని ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్క్ సహా ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను వంద రోజుల్లోపు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను వెంటనే పరిష్కరించుకుంటూ పనులు వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.పూర్తయిన పనుల బిల్లుల అప్‌లోడ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ఆర్థిక పురోగతిలో జిల్లాను ముందు వరుసలో నిలబెట్టాలని కోరారు. జిల్లా ఆదాయ వనరులపై దృష్టి సారించిన కలెక్టర్, రంగాల వారీగా జీడీపీ వృద్ధిని సమీక్షించారు. ఏ రంగాల్లో వెనుకబాటు ఉందో గుర్తించి, వృద్ధిని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చిన నేపథ్యంలో, పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో జిల్లా ఉత్తమ ప్రతిభ కనబరిచేలా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. రానున్న వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా గ్రామస్థాయి నుంచి పక్కాగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై రాజీ పడకూడదని, వసతి గృహాల్లో సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీ రాజ్‌కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

**-డి. ఆర్. ఓ, లక్ష్మణమూర్తి**

**-145 అర్జీల స్వీకరణ**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 9(వార్త):** అర్జీలు త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి, ఎస్వీ. లక్ష్మణమూర్తి, జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జయదేవితో కలిసి ఆయన అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలు పెండింగ్ లో లేకుండా తగు పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలకు సంబంధించి వివిధ శాఖలకు పరిష్కారం కోరుతూ వచ్చిన 145 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ-(జజూూ)42, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పవర్టీ-37, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-11, పంచాయతీరాజ్ 10, ఎపిఈపీడిసియల్-8, హౌసింగ్ కార్పొరేషన్ 6, రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్ 4, స్కూల్ ఎడ్యుకేషన్ 4, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ 4, వాటర్ రిసోర్స్ 3, రోడ్లు, భవనాల శాఖ 2, పోలీస్ శాఖ 2, వ్యవసాయ శాఖ 2, కాలేజీ ఎడ్యుకేషన్ 1, దేవాదాయ శాఖ 1, రూరల్ డెవలప్మెంట్ 1, కుటుంబ సంక్షేమం 1, ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ శాఖ 1, మైండ్స్ అండ్ జుయాలజీ 1, పబ్లిక్ హెల్త్ 1, ఉమెన్ డెవలప్మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ 1, మత్స్య శాఖ 1, రవాణా శాఖ 1, అర్జీలను స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో , జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జయదేవి. జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీలో చర్చించాలి




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 9(వార్త):** ఈ నెల 12 నుంచి జరిగే అసెంబ్లీ సమా వేశాల్లో జాబ్ క్యాలెండర్‌పై ప్రకటన చేయాలని, నిరుద్యోగుల సమస్య పరిష్కా రానికి మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్ కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ ఆఫీసు నందు ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే భర్తీ చేస్తామని చెప్పి, ప్రతి జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇంతవరకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని అన్నారు. అదేవిధంగా నిరుద్యోగ యువతకు మూడు వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్న నిరుద్యోగ భృతి ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో పనిచేసిన ఏపీ బేవరేజెస్ కార్మికులు, రేషన్ డిపో వాహనాలలో పనిచేసిన కార్మికులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వారి ఉద్యోగాలను తీసివేసి రోడ్డు మీద పడేసిందని తక్షణమే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని నెలకు పదివేల రూపాయలు బృత కల్పిస్తామని చెప్పిన కూటమి నాయకులు వాలంటీర్ వ్యవస్థను తీసివేసిందని వెంటనే వాలంటీర్ వ్యవస్థ కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదే ప్రకారంగా ప్రతి సంవత్సరం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పి నిర్వహించకపోవడం వలన డీఎస్సీ అభ్యర్థులకు వయసు పెరిగిందని వారికి వయోపరిమితి 49 సంవత్సరాలకు పెంచాలని, టెట్ మరల నిర్వహించి టెట్ అభ్యర్థులను ఆదుకోవాలని కోరారు. కనీసం ఈ అసెంబ్లీ సమావేశాలలోనైనా నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో శ్రీకాకుళం జిల్లాలో ఉన్న మంత్రులు, కలెక్టర్ కార్యాలయం ముట్టడించి నిరుద్యోగులకు అండగా ఏఐవైఎఫ్ ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ టౌన్ కన్వీనర్ వై వేణు, ఏఐవైఎఫ్ నాయకులు వసంతరావు, అన్నాజీ, శ్రీ నిధి, ఉపేంద్ర, రామోజీ, రామమూర్తి, రమేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి చెందాలి




**మెళియాపుట్టి, ఫిబ్రవరి 9(వార్త):** మహిళలు ఆర్థికంగా మరింత పురోభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆ దశగా కృషి చేస్తుందని కోసమాల పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహన రావు అన్నారు. సెర్ప్, డిఆర్డిఏ వారి నేతృత్వంలో మెళియాపుట్టి మండల కేంద్రంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం నాడు సూక్ష్మ వ్యాపార అభివృద్ధి శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం అవుతూ అన్ని రంగాలలో ముందుండ అన్నారు. నాబార్డ్ డీజీఎం రమేష్ కృష్ణ మాట్లాడుతూ ములగ సాగువలన కలుగు లాభాలను తెలియజేస్తూనే ఆసక్తి ఉన్న సభ్యులకు మునగాకు పౌడర్ తయారు చేసే విధానాన్ని సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేస్తు అనేక అంశాలపై మాట్లాడారు. ఎల్ డిఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందిందుకు మహిళలు వారికి ఆసక్తి ఉన్న రంగాలలో రాణించేలా రుణాలు మంజూరు చేసి వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. డి పి ఎం నారాయణరావు మాట్లాడుతూ మహిళలు ఆసక్తిగల రంగాలలో రాణించేలా వారికి శిక్షణ కార్యక్రమాలను కల్పించడంతోపాటు మార్కెటింగ్ సౌకర్యాలు తదితర వాటిని కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాతపట్నం ఏఎంసి చైర్మన్ ప్రతినిధి బైరిసింగి దినకర్, తహసిల్దార్ పాపారావు, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, వెలుగు ఏపిఎం త్రినాధమ్మ, మండల విద్యాశాఖధికారులు దేవేందర రావు, పద్మనాభరావు, ఏపీఓ రవి, వెలుగు జిల్లా మహిళా సంఘ అధ్యక్షురాలు జి. గంగమ్మ, ఇతర శాఖధికారులు, మండల దేశం పార్టీ అధ్యక్షుడు నంబాల వెంకటరావు, ప్రధాన కార్యదర్శి బొచ్చు ప్రసాదరావు, రాష్ట్ర గౌడ సంఘ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అనపాన రాజశేఖర్ రెడ్డి, పార్లమెంటరీ అధికార ప్రతినిధి బూర్లె లలిత కుమారి, ధరణి, యువత అధ్యక్షులు బస్వ పరమేశ్వర్ రెడ్డి, మాలతి శ్రీధర్, ఇప్పిలి కృష్ణారావు, బమ్మిడి భాస్కరరావు, కదంబాల పైడ్రాజు, ప్రజా ప్రతినిధులు, మహిళాలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ వినియోగంపై 'స్మార్ట్' అవగాహన

**ఈ నెల 23 వరకు ప్రత్యేక కార్యక్రమాలు**

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 9(వార్త):** విద్యుత్ వినియోగదారులకు అత్యాధునిక సాంకేతిక సేవలు, ప్రీ-పెయిడ్ మీటర్ల వినియోగంపై అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా 'స్మార్ట్ మీటర్స్ పఖ్వాడా' పక్షోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 23 వరకు సాగే ఈ కార్యక్రమాల ద్వారా వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల విశిష్టతను వివరించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ మీటర్ల వినియోగదారులు తమ అవసరానికి తగినట్లుగా ముందస్తు చెల్లింపులు చేసుకోవచ్చని, మొబైల్ యాప్ ద్వారా నిరంతరం విద్యుత్ వినియోగాన్ని పర్యవేక్షించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. మానవ తప్పిదాలకు తావులేకుండా ఖచ్చితమైన బిల్లింగ్, బ్యాలెన్స్ తక్కువగా ఉన్నప్పుడు ముందస్తు హెచ్చరికలు రావడం ఈ మీటర్ల ప్రధాన ప్రయోజనాలన్నారు. పక్షోత్సవాల్లో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, మొబైల్ యాప్ ఇన్‌స్టాలేషన్ కేంద్రాలు, మీటర్ల పనితీరుపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వివరించారు. విద్యుత్ వినియోగాన్ని నియంత్రించుకోవడానికి, పారదర్శక సేవలు పొందేందుకు వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో మీటర్ల అమరికకు వచ్చే విద్యుత్ సిబ్బందికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని, సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


## ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 9 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలోశాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు అప్పలాచా ర్యులు, కార్యదర్శి భాస్కరరావు, పిఆర్ఓ శ్రీరామ్మూర్తి విచ్చేసి తగు సూచనలు చేశారు. ప్రైవేట్ స్కూల్‌లు ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు అభివృద్ధి చేయుటకు మరెన్నో మంచి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.కృష్ణమూర్తి రెడ్డి, ఇచ్ఛాపురం నియోజకవర్గం అధ్యక్షులు సిహెచ్ తులసీదాసు, కార్యదర్శి కె.రామారావు, ఇచ్ఛాపురం పట్టణ అధ్యక్షులు పి.చిరంజీవి, కార్యదర్శి మార్కండేయులు, కంచిలి ఆదినారాయణ, సోంపేట కెవి రమేష్‌బాబు, కవిటి రమేష్ పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలతో ..

## నరసన్నపేటలో ప్రజలకు అవస్థలు



**నరసన్నపేట, ఫిబ్రవరి 9(వార్త):** నరసన్నపేటలోని మార్కెట్ ప్రాంతాలతో పాటు కళాశాల రహదారులు ఇరుకుగా ఉండటంతో, అక్కడ భారీ వాహనాల రాకపోకలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రహదారి వెడల్పు తక్కువగా ఉన్నప్పటికీ పెద్దపెద్ద లారీలు నిరంతరం రాకపోకలు సాగిస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మార్కెట్ ప్రాంతంలో రహదారి అత్యంత సన్నగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులతో పాటు కాలినడకన వెళ్లే ప్రజలు కూడా తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రద్దీ వేళల్లో వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కళాశాల రహదారులపై కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు భయంతో ప్రయాణం చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. భారీ వాహనాల కారణంగా తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతూ, ప్రమాదాల ముప్పు పెరుగుతోందని తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ఇరుకైన రహదారుల్లో భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయాలని, ప్రత్యామ్నాయ మార్గాలు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

## మహిళా జర్నలిస్టుకు రాష్ట్ర ప్రెస్ అకాడమీ సన్మానం

**పలాస, ఫిబ్రవరి 9 (వార్త):** రాష్ట్ర సిఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ పలాస కు చెందిన ఏకైక మహిళా జర్నలిస్టు సిహెచ్ మేఘనా సాయికు సోమవారం మధ్యాహ్నం సోంపేటలో ఘనంగా సన్మానించి సత్కరించారు. శ్రీకాకుళం జిల్లా సోంపేటలో రెండు రోజులపాటు వివిధ అంశాలపై రిపోర్టర్లకు ప్రభుత్వం తరపున శిక్షణ తరగతులు నిర్వహించారు. ముగింపు రోజు మేఘనా సాయి జర్నలిజములో చూపెడుతున్న కృషిని పట్టుదలను గుర్తించి ఈ సన్మానం జరుగుతున్నట్లు ఏపీ డబ్ల్యూ జే యు జిల్లా అధ్యక్షులు చిక్కోలు జగదీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేయు నెల్లి ధర్మారావు, ప్రెస్ అకాడమీ వైస్ చైర్మన్ సోమ సుందర్ పలాస ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు నేతాజీ, కొంచాడ రవి, గౌరవ అధ్యక్షులు సురో, జగన్, కుమార్, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, పలాస ప్రెస్ క్లబ్ ఆమెకు సన్మానంపై హర్షం వ్యక్తం చేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

**సారవకోట, ఫిబ్రవరి 9(వార్త):** సారవకోట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శిలతో ఎంపీడీవో మోహన్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ వారీగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. ప్రధానంగా శానిటేషన్, స్వామిత్వ పథకం, పీఆర్--1, తాగునీటి సరఫరా, పన్నుల వసూలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇంటి పన్నును నూరు శాతం వసూలు చేసే దిశగా కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. పన్ను వసూలులో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. అలాగే నాన్‌టాక్స్ ఆదాయ వనరులపై కూడా దృష్టి సారించి, పంచాయతీల ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

గ్రామ స్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో అప్పన్నతో పాటు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం దృష్టికి ఒడియా సమస్యలు

### -మందసలో అపోటా ఆధ్వర్యంలో మేధా సమ్మాన్

### -పాల్గొన్న ప్రముఖులు, అధికారులు



**మందస, ఫిబ్రవరి 9(వార్త):** ప్రభుత్వం దృష్టికి ఒడియా మైనార్టీ సమస్యలను తీసుకెళ్తామని నాయకులు అన్నారు. మందస పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆంధ్ర ప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేధా సమ్మాన్ అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇచ్ఛాపురం నియోజకవర్గ శాసనసభ్యుడు బెందాళం అశోక్ బాబు హాజరై ముఖ్యవక్త గా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి తెచ్చిన ఒడియా ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యలను విద్యాశాఖామంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీష మాట్లాడుతూ ఒడియా మైనారిటీ ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలిపారు. ఈ సమస్యలు పరిష్కారం జరిగేందుకు సహకరించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జి.శ్రీనివాసనాయుడు ప్రసంగిస్తూ జీవో నెంబరు 117 రద్దుకై కృషి చేస్తానన్నారు. శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ అధికారి రవిబాబు మాట్లాడుతూ ఒడియా ఉపాధ్యాయులు విద్యార్థుల మేధస్సును తెలుసుకొనుటకు ప్రతిభా పరీక్షలు నిర్వహించి విద్యార్థులను సన్మానించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఒడియా ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పదవీ విరమణ చేసిన 15మంది ఒడియా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అపోటా మందస మండల శాఖ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఒడియా ఉపాధ్యాయులు, ఒడియా భాషాభిమానులు, మేధా విద్యార్థులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. యుసోమా అధ్యక్షుడు సత్యన్నారాయణపాడి మైనార్టీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సమస్యలు, విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఉత్కళ సమ్మేళన ప్రతినిధులు మాట్లాడుతూ ఒడిషా ముఖ్యమంత్రి సహకారంతో ఆంధ్రాలో ఒడియా విద్యార్థులకు ఉన్నత చదువులలో రాష్ట్రకోటాలో తగిన అవకాశాలు కల్పిస్తామన్నారు. ఏప్రిల్ 2025లో జరిగిన ఎస్ఎస్సీ పరీక్షలో రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు అతిథుల సమక్షంలో సన్మానించారు. పదవ, ఎనిమిది, 5వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల సమక్షంలో సన్మానించారు.

అపోటా మందస మండల మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ మహంతి, సంపాదకులు శంకర అతిథులను ఆహ్వానించారు. సీనియర్ ఉపాధ్యాయుడు సింహాచలపతి ఓట్ ఆఫ్ థాంక్స్ చెప్పారు. కార్యక్రమం ఆసాంతం డీఐ ఆఫ్ ఒడిశా, రాష్ట్ర కార్యదర్శి బృందావన్ దొలాయి, అధ్యక్షుడు భాస్కరపాడి పర్యవేక్షించారు.

## అవార్డు గ్రహీతలకు అభినందన



**పలాస, ఫిబ్రవరి 9 (వార్త):** డాక్టరేట్ కు సవర జగన్నాయకులకు, ఎన్టీఆర్ అవార్డు పొందిన జె రమణరావులకు సోమవారం అభినందన సభను పలాస పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహంలో నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు పి ఈశ్వరరావు ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేశారు. డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ యూఎస్ఏ/ఇండియా సంస్థ వారు చేయూత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చే ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులుకి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఎన్టీఆర్ అవార్డు పొందిన జె. రమణారావుకి ఎన్టీఆర్ అవార్డు అందుకున్నారు. పలాస మండల శాఖ నిర్వహించిన ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయ్ ఫెడరేషన్ సమక్షంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ అధ్యక్షులు రాంబాబు, పలాస డిప్యూటీ ఎంపీడీవో ఉమాపతి, జిసిసి మేనేజర్ రాము, ఎస్ యర్రం నాయుడు, ఎస్ గణేష్, రామ్మోహన్ రావు, ఎస్ మోహన్ రావు, ఎస్ రామారావు, ఎస్ చంద్రశేఖర రావు, లోకేష్, వార్డెన్ సునీత, మహిళా పోలీస్ డి తులసమ్మ, ఎస్ సూర్య రావు తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




**పలాస, ఫిబ్రవరి 9 (వార్త):** ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ఆర్ టి సి కాంప్లెక్స్ నుండి బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు యన్ గణపతి, కార్మిక, రైతు సంఘాల నాయకులు యన్ గణపతి, లండ వెంకటరావు, కుత్తుమ లోకనాదం, టి అజయ్ కుమార్, యస్ కుమార్ తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక హక్కులు కాపాడాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె జరుగుతుందని, ఈ సమ్మెలో యావత్ కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్పొరేట్లకు లబ్ది చేకూర్చాలని, కార్మిక చట్టాలు మార్చేసి కార్మికులను బానిసలుగా మార్చేయాలని చూస్తున్నారని అన్నారు. ఈ విధానాలు విరమించుకోకపోతే ఈ ప్రభుత్వాలను సాగనంపాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కార్మిక, ప్రజా అనుకూల చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమ్మె ప్రచారం విస్తృతంగా చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వి ముకుంద రావు, బి ప్రసాద్, టి రాజు, సోమేశ్వరావు, పి నాగేశ్వరావు, టి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ స్త్రీనిధి, ఉన్నతి రుణాలు



**మందస, ఫిబ్రవరి 9(వార్త):** మండల పరిధిలో గల అర్హత గల అన్ని గ్రామ సంఘాల నుంచి సమృద్ధి డిపాజిట్ కట్టించిన గ్రూపులన్నింటినీ వారి పుస్తక నిర్వహణను పరిశీలించి అర్హత గల సంఘాలన్నింటికీ అతి తక్కువ వడ్డీకే (92పైసలు) ఏ విధమైన డాక్యుమెంటేషన్, ప్రాసెసింగ్, ఇన్స్పెక్షన్ చార్జీలు లేకుండా రుణాలను మంజూరు చేస్తున్నట్లు వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందసలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోగల హంసరాలి, కొండలోగాం గ్రామ సంఘాల్లో అర్హత గల గ్రూపులకు ఉన్నతి రుణాలను కూడా డాక్యుమెంటేషన్ చేయించి బయోమెట్రిక్ వేయించమని సిబ్బందిని ఆదేశించారు. బకాయి లేకుండా ఉన్న గ్రామ సంఘాలలో షెడ్యూలు కులాలు, తెగలకు సంబంధించిన అర్హత గల సంఘాలకు వడ్డీ లేకుండా ఉన్నతి రుణాలను కూడా మంజూరు చేసుకునే అవకాశం ఉన్నట్లు వివరించారు. మిగతా గ్రామ సంఘాల కూడా గతంలో ఇచ్చిన ఉన్నతి రుణాలను బకాయి లేకుండా ఈ నెలలో చెల్లిస్తే మార్చి తరువాత కొత్తగా అన్ని గ్రూపులకు కూడా వడ్డీ లేకుండా ఉన్నతి రుణాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ రాము, మందస క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## భద్రావతి దేవి సమేత కల్యాణోత్సవం

**పలాస, ఫిబ్రవరి 9(వార్త):** శ్రీ మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కాశీబుగ్గ రోటరీనగర్ లో జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ భద్రావతి దేవి సమేత శ్రీ బావనాఋషి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి డాక్టర్ సీదిర అప్పలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ భద్రావతి దేవి సమేత భావనారుషి స్వామి (లేదా భావన రుషి) వారి కల్యాణోత్సవం పద్మశాలి సంఘానికి ఆరాధ్య దైవాలైన ఈ దేవతల దివ్య వివాహోత్సవమని తెలిపారు. భావనారుషి స్వామి (భక్తమార్కండేయ స్వామి రూపం), భద్రావతి దేవిలు పద్మశాలి కులస్థుల ఇష్ట దేవతలని తెలిపారు. ధ్వజారోహణం, పంచామృతాభిషేకం, కల్యాణ మహోత్సవం, గ్రామోత్సవం (శోభా యాత్ర), వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులు యావన్మంది, పలాస-కాశీబుగ్గ పట్టణ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శిష్టు.గోపీ, 18వ వార్డు కౌన్సిలర్ సనపల సింహాచలం, వైస్సార్సీపీ పలాస మండల పార్టీ అధ్యక్షులు దువ్వాడ.రవి, వైస్సార్సీపీ రాష్ట్ర బూత్ కమిటీ సంయుక్త కార్యదర్శి చింతాడ.మాధవరావు, వైస్సార్సీపీ నాయకులు కవిటి సూరిబాబు, సాసుమాను శ్యామసుందర్, కల్లేపల్లి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## శరవేగంగా ఆలయ అభివృద్ధి పనులు...!




**కొత్తూరు, ఫిబ్రవరి 9 (వార్త):** నివగాం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ఎల్లమాంబ జామయాత్ర (జాతర) వేడుకలకు రంగం సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు గ్రామస్తుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ముఖ్యంగా గ్రామ యువత ఐకమత్యంతో ఈ పనులను శరవేగంగా పూర్తి చేస్తుండటం విశేషం. గత ఏడాది (2025) నిర్వహించిన జాతర మహోత్సవంలో గ్రామ యువత క్రియాశీలక పాత్ర పోషించి, వేడుకలను దిగ్విజయంగా పూర్తి చేశారు. జాతర ఖర్చులు పోను మిగిలిన సొమ్మును వృథా చేయకుండా, ఆలయ శాశ్వత ప్రయోజనాల కోసం వినియోగించాలని యువత సంకల్పించింది. ఈ మేరకు గ్రామ పెద్దల సమక్షంలో చర్చించి, ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం ఒక శాశ్వత భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామ పెద్దల పర్యవేక్షణలో యువత స్వచ్ఛందంగా శ్రమిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు. "సొంత ఊరి పండగను ఘనంగా నిర్వహించుకోవడంతో పాటు, ఆలయ అభివృద్ధికి మేమంతా సైనికుల్లా పని చేయడం సంతోషంగా ఉంది" అని గ్రామ యువకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. వచ్చే జాతర నాటికి ఈ భవనాన్ని పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్నారు. యువత చూపుతున్న ఈ చొరవను, బాధ్యతాయుతమైన ప్రవర్తనను నివగాం గ్రామ ప్రజలు మరియు గ్రామ పెద్దలు యువకులను అభినందిస్తున్నారు.

### బసివాడ రైల్వే అండర్ పాసేజ్

# బురదమయం

**జలుమూరు, ఫిబ్రవరి 9(వార్త):** బసివాడ గ్రామం సమీపంలో ఉన్న రైల్వే అండర్ పాసేజ్ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. నిత్యం బురదతో నిండిపోయి ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అండర్ పాసేజ్ అంతటా నాచు పట్టిపోవడంతో ద్విచక్ర వాహనాల టైర్లు జారిపడి ప్రమాదాలు జరుగుతున్న ఘటనలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వర్షపు నీరు నిరంతరం అండర్ పాసేజ్‌లోకి చేరడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. నీటి పారుదల సరైన విధంగా లేకపోవడం, శాశ్వత పరిష్కారం చేపట్టకపోవడం వల్ల సమస్య రోజురోజుకీ మరింత తీవ్రమవుతోందని వారు పేర్కొన్నారు. ఈ అండర్ పాసేజ్ గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల వాహనదారులకు కీలక మార్గంగా ఉండటంతో ప్రమాదాల ముప్పు మరింత పెరిగింది. తక్షణమే అధికారులు స్పందించి నీరు లోపలికి రాకుండా పక్కా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, బురద తొలగించి ప్రయాణానికి అనుకూలంగా మార్గాన్ని సురక్షితంగా తీర్చిదిద్దాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చొరవ చూపకపోతే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయించండి

### -ఎమ్మెల్యే శంకర్‌కు ఎస్ఎఫ్ఐ వినతి



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 9(వార్త):** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రీకాకుళ శాసనసభ్యులు గొండు శంకర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు డి చందు, పి ఖగేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 7వేల కోట్లకు పైగా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని రాష్ట్రంలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు లక్షల్లో ఉన్నారు ముఖ్యంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వంటి కోర్సులు చేస్తున్న విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా 7000 కోట్లు ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ గత రెండు సంవత్సరాలుగా బకాయిలు ఉన్నాయి. ఇవి రాకపోవడం వలన విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఏదైతే సర్టిఫికెట్లు తీసుకునే క్రమంలో, పరీక్షల సమయంలో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు ఈ సమస్యలు రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు విద్య సంస్థలతో పాటు, ప్రభుత్వ కళాశాలలో మరియు యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు ఈ యొక్క సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. చదువులు పూర్తయిన తర్వాత పై చదువులు చదివే దానికి గాని ఉద్యోగాల్లో చేరే దానికి గాని అవకాశం లేకుండా పోతుంది. చిన్నచిన్న ప్రైవేట్ బడ్జెట్ కళాశాలలో ఈ బకాయిలు రాక అధ్యాపకులకు జీతాలు చెల్లించకపోవడం వలన విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమవుతుంది. ఏదైతే 11వ తారీఖు నుండి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో మన నియోజకవర్గం విద్యార్థుల తరఫున మీరు ఈ బకాయిలు ఉన్న 7000 కోట్లు స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని, గణతంత్ర దినోత్సవంలో చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే కాలేజీ, స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్, గర్ల్స్.. స్టూడెంట్స్ మేనేజ్మెంట్ హాస్టల్‌కు నిధులు కేటాయించి పనులు వెంటనే మొదలు పెట్టాలని కోరారు. కోడి రామ్మూర్తి స్టేడియం పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకురాలు దివ్య, టౌన్ కమిటీ సభ్యులు మురళి, జగన్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల పురోభివృద్ధికి కృషి చేయాలి




**నరసన్నపేట, ఫిబ్రవరి 9(వార్త):** ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసే దిశగా ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని ఎంఈఓ-2 పేడాడ దాలినాయుడు అన్నారు. సోమవారం బాడాం జెడ్పీ పాఠశాలను ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచేలా ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంచే విధంగా బోధనా నాణ్యతను మరింత మెరుగుపరచాలని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ పాఠశాలల సౌకర్యాలు, విద్యా ప్రమాణాలను వివరించి వారిని ఆకర్షించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని దాలినాయుడు సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని, ప్రతి ఉపాధ్యాయుడు తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో పాఠశాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చ జరగగా, ఉపాధ్యాయులు తమ సూచనలు, సమస్యలను ఎంఈఓ దృష్టికి తీసుకువచ్చారు.

## కొండపోలవలస పాఠశాలలో ఎఫ్ఏ-4 పరీక్షల పరిశీలన

**జలుమూరు, ఫిబ్రవరి 9(వార్త):** కొండపోలవలస ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఫార్మేటివ్ అసెస్మెంట్-4 (ఎఫ్ఎ-4) పరీక్షలను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ-2) ఎం.వి.ఆర్.ఎస్. ప్రసాదరావు సోమవారం పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరును సమీక్షించిన ఆయన, విద్యార్థులు పరీక్షలను ప్రశాంతంగా, సక్రమంగా రాయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రశ్నలను పూర్తిగా అర్థం చేసుకొని జవాబులు రాయాలని, అక్షరాలు అందంగా, తప్పుల్లేకుండా రాస్తే మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. పరీక్షల సమయంలో తొందరపడకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. పరీక్షల విషయంలో విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే వాటిని వెంటనే గుర్తించి సరిచేయాలని అన్నారు. పరీక్ష రాసే విధానం, నిబంధనలను ముందుగానే విద్యార్థులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. మధ్యాహ్నం కూడా పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పరీక్షలు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని, విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంఈఓ ప్రసాదరావు తెలిపారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## అచ్యుతాపురంలో గర్భిణులకు ఉచితంగా మందుల అందజేత

**జలుమూరు, ఫిబ్రవరి 9(వార్త):** ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జలుమూరు మండలం అచ్యుతాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు సుజాత, లక్ష్మీ ప్రసన్న తెలిపారు. సోమవారం ఈ ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి, ముఖ్యంగా రక్తహీనతతో బాధపడుతున్న మహిళలకు ప్రత్యేక వైద్య సహాయం అందిస్తున్నామని తెలిపారు. అవసరమైన పరీక్షలు నిర్వహించి, వైద్యుల సూచనల మేరకు చికిత్స అందజేస్తున్నామని వివరించారు. ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న ఉచిత మందులను గర్భిణులకు అందజేశామని, మాతృ--శిశు ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామని వైద్యాధికారులు తెలిపారు. గర్భిణులు నిర్భయంగా ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించి ఆరోగ్య సేవలు పొందాలని వారు సూచించారు.



# వాసుదేవా..నమో నమ:



### - వైభవంగా వాసుదేవుని బ్రహ్మోత్సవాలు
### -దేవతాహ్వానం పలికిన వేదపండితులు
### -ఘనంగా అగ్నిప్రతిష్టామహోత్సవం

**మందస, ఫిబ్రవరి 9(వార్త):** శ్రీవాసుదేవపెరుమాళ్ బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. భక్తుల తాకిడి పెరుగుతోంది. బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయంతో పాటు మందస పట్టణంలో కూడా ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి, స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలారాధన, నివేదన, గోష్టి, యాగశాలలో ధ్వారతోరణ, ధ్వజకుంభారాధన, వేద విన్నపములు, చతుఃస్థానార్చన, విశేషహోమములు, పంచసూక్త, పరివార, ప్రాయశ్చిత్త హోమములు, నివేదన, నిత్యపూర్ణాహుతి, బలిహారణ, శాత్తుముర్రై, శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రపారాయణం, ప్రసాదగోష్టి జరిగాయి. ఉదయం 9గంటలకు యాగశాలలో అగ్నిప్రతిష్ట, హోమాలు, పారాయణలు, విశేష గరుడపూజ, సంతానార్థులకు గరుడప్రసాద వితరణ జరిగింది. 11 గంటలకు హనుమద్వాహనసేవ, శ్రీరామపూజ, 6 గంటలకు శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం, సేవాకాలం, తీర్థగోష్టి, మందస పురవీధుల్లో శేషవాహనసేవ జరిగాయి. ప్రాణకోటికి మూలం శ్రీమన్నారాయణుడు సమస్త ప్రాణకోటికి మూలాధారం శ్రీమన్నారాయణుడేనని, నారాయణ మంత్రమే శ్రీరామరక్షని శ్రీత్రిదండి దేవనాథరామానుజ జీయర్ స్వామి అన్నారు. భక్తులనుద్ధేశించి ఆయన ఆలయ ఆవరణలో మాట్లాడుతూ భగవత్సంకల్పముతో మానవజాతి ముందుకు వెళ్తాందని, ప్రతీ ఒక్కరూ శ్రీమన్నారాయణుడిని భక్తితో బుధవారం ఆయన ఆలయ ఆవరణలో మాట్లాడుతూ భగవత్సంకల్పముతో మానవజాతి ముందుకు వెళ్లోందని, ప్రతీ ఒక్కరూ శ్రీమన్నారాయణుడిని భక్తితో కొలవాలన్నారు. ఆధ్యాత్మిక చైతన్యంతోనే సామాజిక అభివద్ధి చెందుతుందని, గోష్టులంతా కలసి నిర్వహిస్తే భారతదేశ సంస్కతి, సాంప్రదాయాలు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. భగవంతుని శరణుకోరడమే శరణాగతి అని అన్నారు. దేవుడు ఒక్కడే అని, ఏ రూపంలో కొలిచినా పలుకుతారని బోధించారు. ప్రతీ మనిషిలోను ఆధ్యాత్మిక చైతన్యం కలిగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు తప్పనిసరి అని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, వేదపండితులు, అర్చకులు పవనస్వామి, సచ్చిదానందపాడి, అనిల్ కుమార్ స్వామి తదతరులు పాల్గొన్నారు.

### బ్రహ్మోత్సవాల్లో నేటి కార్యక్రమాలివే..

ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలారాధన, నివేదన, గోష్టి, యాగశాలలో ధ్వారతోరణ, ధ్వజకుంభారాధన, వేద విన్నపములు, చతుఃస్థానార్చన, విశేషహోమములు, పంచసూక్త, పరివార, ప్రాయశ్చిత్త హోమములు, నివేదన, నిత్యపూర్ణాహుతి, బలిహారణ, శాత్తుముర్రై, శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రపారాయణం, ప్రసాదగోష్టి కార్యక్రమాలుంటాయి. అదేవిధంగా ఉదయం 9గంటలకు యాగశాలలో విశేష హోమములు, పారాయణలు, వేదికపై పండితులు, జీయర్ స్వాములు ఉపన్యాసములు, 9గంటలకు కల్పవక్ష వాహనసేవ, లక్ష్మీపూజ, ఆధ్యాత్మిక, సాంస్క తిక కార్యక్రమాలు, 6 గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ సేవాకాలం, తీర్థగోష్టి, ఎదుర్కోలు ఉత్సవం, హంసవాహన, గజవాహన సేవ నిర్వహిస్తారు.





## శ్రీముఖలింగం చక్రతీర్థ స్నానాలకు తప్పని అవస్థలు



**జలుమూరు, ఫిబ్రవరి 9(వార్త):** శ్రీముఖలింగంలో ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఉత్సవాల్లో భాగంగా 18వ తేదీన జరిగే చక్రతీర్థ స్నానాలకు సంబంధించి భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. చక్రతీర్థ స్నానాల కోసం వంశధార నదిలోకి వెళ్లే మార్గం అత్యంత ఇరుకుగా ఉండటంతో భారీగా భక్తులు తరలివస్తే రాకపోకలకు ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ యాత్రకు సుమారు లక్షకు పైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తుండటంతో, భద్రతా, సౌకర్యాల పరంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి ముందుగానే రహదారిని వెడల్పు చేయడం, క్యూలైన్లు ఏర్పాటు చేయడం, భక్తుల రాకపోకలకు అనువైన ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇరుకైన మార్గాల కారణంగా తొక్కిసలాట వంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తులకు సౌకర్యవంతంగా జరగాలంటే సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి తక్షణమే అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నీటి సంఘం అధ్యక్షుడు నిరంజన్‌కు సన్మానం



**పలాస, ఫిబ్రవరి 9 (వార్త):** వంశధార నీటి సంఘం అధ్యక్షుడు గునప నిరంజన్ కు ఘనంగా సోమవారం సన్మానం చేశారు. రిట్టపాడులో శ్రీ వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేశారు. సన్మానం చేసిన వారిలో గున్న జయరామ్, సీపాన కరుణాకర్, సీపానా బాలయ్య, పినింటి రామారావు, బాబురావు గౌనప, గ్రామస్తులు అందరూ గౌనప నిరంజన్, నా భార్య భార్గవిని కలిపి సన్మానం చేశారు. సందర్భంగా వక్తులు మాట్లాడుతూ పదవి అంటే అధికారం కాదని, రైతు సేవకు అప్పగించిన బాధ్యతని నిరూపిస్తున్న పలాస నియోజకవర్గ వాసి, శ్రీకాకుళం జిల్లా నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు గౌణప నిరంజన్ ను అభినందించారు.

ఇటీవల గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సన్మానం అందుకోవడం నిరంజన్ నిబద్ధతకు నిదర్శనం. సాగునీటి సమస్యల పరిష్కారంలో రైతుల పక్షాన నిలుస్తూ, నిజాయితీగా శ్రమిస్తున్న నిరంజన్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను. అందరికి ధన్యవాదములు తెలిపారు. పెద్దలందరు ప్రశంసించారు. రిట్టపాడు గ్రామస్తుల అందరూ సన్మానించారు.

ఈ కార్యక్రమంలో వజ్జ బాబురావు (ఏపిటి ఎఫ్ సి), పీరుకట్ల విఠల్ రావు (జిల్లా గ్రంధాలాయ చైర్మన్), డాక్టర్ పొందలజగదీశ్( న్యూరో సర్జన్), కచ్చి అప్పలస్వామి (సహాయ సంచాలకులు వెర్టెనరీ), బమ్మిడి సుబ్బారావు (రిటైర్డ్ టీచర్), గున్న మధు సూదనరావు (రిటైర్డ్ టీచర్), బుల్లోజు శశి బూషన్ (టీడీపీ మండలం మాజీ అధ్యక్షులు), రాజంగ్రామ సాంబమూర్తి(పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షులు), యవ్వారి మోహన్ రావు, అంబటి రామకృష్ణ (మాజీసర్పంచ్ డోకులపాడు), గ్రామస్తులు సన్మానం చేశారు.

## నరసన్నపేట-కంబకాయ రహదారి
# గుంతలమయం..!

### - ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకం

**నరసన్నపేట, ఫిబ్రవరి 9(వార్త):** నరసన్నపేట నుంచి కంబకాయకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో నిండిపోయి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రహదారంతా పెద్ద పెద్ద గుంతలు తేలిపోవడంతో ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై రోజూ విద్యార్థులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు పలుమార్లు బోల్తాపడి ప్రమాదాలకు గురైన ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణం చేయాలంటే భయంతో వెనుకడుగు వేస్తున్న పరిస్థితి నెలకొంది. సుమారు పది గ్రామాల ప్రజలు ఈ రహదారిపై ఆధారపడి నిత్య అవసరాల కోసం ప్రయాణం చేస్తుండటంతో సమస్య తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. రహదారి మరమ్మతులు ఆలస్యం కావడం వల్ల వాహనాల నష్టం కూడా పెరుగుతోందని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టి, ప్రయాణికుల భద్రతను కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చేపట్టకపోతే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.



# ఫ్లెక్సీల రగడపై ఫిర్యాదు

### -నరసన్నపేటలో అధికారుల నిర్లక్ష్యంపై ఆరోపణలు



**నరసన్నపేట, ఫిబ్రవరి 9(వార్త):** నరసన్నపేటలోని ప్రధాన రహదారిపై అనుమతిలేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని కోరుతూ నరసన్నపేట వాసులు జిల్లా కేంద్రంలోని ఫిర్యాదుల విభాగాన్ని ఆశ్రయించారు. గత సోమవారం ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, మండల స్థాయి అధికారులు స్పందించలేదని కరగాం గ్రామానికి చెందిన యల్ల మల్లేశ్వరరావు సోమవారం మరోసారి ఫిర్యాదు చేశారు. రహదారి మీద ఫ్లెక్సీలు వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారడంతో పాటు ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై స్పందించిన జిల్లా రిసెప్షన్ (డిఆర్) అధికారులు తక్షణమే సమస్యపై చర్యలు చేపడతామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు. అయితే, ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో చర్యలు అమలు కావాలని ప్రజలు కోరుతున్నారు. ఫ్లెక్సీల తొలగింపులో జాప్యం కొనసాగితే ప్రజల అసహనం మరింత పెరిగే అవకాశముందని, అధికారులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546